
# పతి(వ్ర)త

## -పాలంకి సత్య కథ

శ్వేత ఇంట్లో కాలుకాలిన పిల్లిలా తిరుగుతోంది. ఆమె కళ్ళముందు పక్కింటావిడ కొనుక్కున్న చీర కదలాడుతోంది. కొత్తగా వస్తున్న ఫాన్సీ డిజైన్ చీరని పది గంటలు దాటేక పక్కింటావిడ తీసుకొచ్చి చూపించి ''వరలక్ష్మి వ్రతానికి కొనుక్కున్నాను'' అని చెప్పింది.

అలాంటి చీర కొనుక్కోవాలన్న కోరిక శ్వేతలో మొలకెత్తి మహావృక్షంలా పెరిగిపోయింది. భర్తని ఒప్పించడమెలా అని ఆలోచిస్తుండగానే నాలుగు గంటలైంది. ''అమ్మో..ఆయన ఇంకో గంటలో వచ్చేస్తారు'' అనుకుంటూ వంటింట్లోకి పరుగెత్తింది శ్వేత.



సాయంత్రం తనకిష్టమైన గులాబ్‌జాం, పకోడీలూ తింటూ ''ఏమిటి విశేషం? అన్నీ స్పెషల్స్ చేశావు'' అన్నాడు చక్రవర్తి.

''విశేషమేమీ లేదు. మీ కిష్టమైనవి చెయ్యాలనిపించింది. చేశానంతే'' అంది శ్వేత.

రాత్రి భోజనాలయ్యాక చక్రవర్తి టి.వి. ముందు కూచున్నాడు. శ్వేత అద్దం ముందు నిల్చుని అలంకరించుకోడం ప్రారంభించింది. కుట్టుపూలున్న తెల్లచీర కట్టుకుని, తెల్లటి జాకెట్టు వేసుకుంది. తలలో మల్లెపూలు పెట్టుకుని, మెడలో ముత్యాల దండ వేసుకుంది. అద్దంలో తన అందం తనకే ముద్దురాగా తృప్తిగా నిట్టూర్చి, మంచం మీద పడుకుంది.

చక్రవర్తి టి.వి. ప్రోగ్రాం కొంతసేపు చూశాక, టి.వి., లైట్ ఆపేసి బెడ్రూంలోకి వచ్చాడు. భార్య అలంకరణ అతనికి చాలా ఆనందాన్ని కల్గించింది. ఎప్పుడూ నలిగిపోయి, మాసిపోయిన నైటీలోనే భార్యని చూడ్డం అలవాటయిన అతనికి తెల్లచీరతో, మల్లెపూలతో శ్వేతని చూడగానే పెళ్ళయిన కొత్తరోజులు జ్ఞాపకం వచ్చాయి. సన్నగా ఈల వేసి ఆమె పక్కకి చేరాడు. శ్వేత దూరంగా జరిగింది.

''తెల్లచీరతో, మల్లెపూలతో నీ పేరు సార్థకమయ్యేలా ఉన్నావు శ్వేతా. నీ ఒంటిరంగుకీ, చీర రంగుకీ తేడా తెలియడం లేదు.''

''పొగడ్తలతో మురిపించి, మరిపించడం మీకే చేతనవును'' అంటూ మరింత దూరంగా జరిగింది శ్వేత.

హుషారుగా ఉన్న చక్రవర్తి ''పొగడ్తలు నోటి చివర నుంచి రావడం లేదు. మనస్సు లోతుల్లో నుంచి వస్తున్నాయి'' అన్నాడు.

''మాటలతో సరి పెట్టడం మీకే చేతనవును'' అంది శ్వేత.

''నేను మాటలతో సరి పెట్టే మనిషిని కాను'' అంటూ శ్వేత మీద చెయ్యి వేశాడు.

ఆమె అతని చెయ్యి తీసివేస్తూ ''అడిగింది చేస్తారా'' అంది.

అతను ఆమె చేతిలో చెయ్యి వేస్తూ ''తప్పకుండా'' అన్నాడు.

''కొత్తరకం చీరలు మార్కెట్‌లోకి వచ్చాయి. అందరూ కొనుక్కున్నారు. నేనే వరలక్ష్మి వ్రతానికి చీర కొనుక్కోలేదు.''

మంచి మూడ్‌లో ఉన్న చక్రవర్తి '' ఈ మాత్రానికేనా? రేపే వెళ్ళి కొనుక్కుందాం.'' అన్నాడు.

అతను చీర ఖరీదు అడగలేదు. భర్త మూడ్ పాడవకుండా జాగ్రత్త పడాలని తెల్సిన శ్వేత ఖరీదు చెప్పలేదు.

''రేపు సాయంత్రం కొనుక్కుందుకు వెడదామా'' అని మాత్రం అందామె.

చక్రవర్తి ''తప్పకుండా'' అంటూ ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

శ్వేత ఇక మాట్లాడలేదు.

వరలక్ష్మి వ్రతంనాడు కొత్తచీర కట్టుకుని తాంబూలాలిచ్చి నమస్కరించిన శ్వేతను ముత్తైదువలందరూ ''దీర్ఘసుమంగళీ భవ'' అని ఆశీర్వదించారు. ''ఈ కాలపు పిల్లల్లా ఎగిరెగిరి పడదు. నోరూ, వాయీ లేని పిల్ల'' అని అమ్మలక్కలందరూ అనుకున్నారు.

లోకం దృష్టిలో శ్వేత పతివ్రత

★ ★ ★

**శాం**తి నెమ్మదిగా తల ఊపి లోపలకు వెళ్ళి డ్రెస్ చేసుకోసాగింది.

నాలుగో రోజుకి అవసరమైన జాగ్రత్తలు తీసుకుని, నీలిరంగు మాక్సీ వేసుకుంది. ముఖానికి మందంగా పౌడరు కొట్టుకుని, సెంటు రాసుకుంది.

''సార్..ఇదిగో మీరు చెప్పిన స్టేట్‌మెంట్ తయారుచేశాను.'' అంటూ ఫైలుని టేబిల్ మీద పెట్టింది శ్రీదేవి. ఫైలుతో పాటు ఆమె పైట కూడా టేబిలు మీదకి చేరింది.

మెల్లిగా టేబిలు మీద పైటకొంగుని తీసి భుజం మీద వేసుకుని ''నాలుగు గంటలు పట్టింది సార్, స్టేట్‌మెంట్ తయారు చెయ్యడానికి, పాత కరెస్పాండెన్స్ అంతా చదివాను'' అందామె.

నాలుగు గంటలసేపు చదివింది పాత కరెస్పాండెన్స్ కాదనీ, సస్పెన్స్ థ్రిల్లర్ నవలనీ ఆమె చెప్పలేదు. ఆడవాళ్ళ



విషయంలో అటువంటివి ఊహించడం ఆఫీసరుకి అలవాటు లేదు.

ఆయన ఫైలు తెరిచి స్టేట్‌మెంట్ చదవడం ప్రారంభించాడు.

''తప్పులున్నాయోఏమో. మనస్సు మనస్సులో లేదు సార్'' కొంగు చివరలు చేతికి తిప్పుకుంటూ అంది శ్రీదేవి.

ఫైలు పక్కన పెట్టి ''ఏమైనా ప్రాబ్లెం ఉందా?'' అన్నాడాయన.

''మా అమ్మగారికి ఒంట్లో బాగోలేదు సార్. మీరు మంచివాళ్ళు కాబట్టి చెప్తున్నాను. నా మనస్సంతా ఇంటిదగ్గరే ఉంది''కొద్దిగా ముందుకు వంగుతూ అందామె. సాయంత్రం సినిమా ప్రోగ్రాం సంగతి ఆమె చెప్పదల్చుకోలేదు.

ఆఫీసరు గారి గుండె ఝల్లుమంది.

''సార్..ఈరోజు కొంచెం ముందుగా వెళ్ళడానికి పర్మిషన్ కావాలి''

''ఈరోజైతే ఫర్వాలేదు. రేపు మాత్రం అడక్కండి''

''రేపేమిటి సార్..ఆఫీసు ఇన్స్పెక్షనుందా''

''రేపు నా బర్త్‌డే..సాయంత్రం స్వాగత్ హోటల్లో పార్టీకి మీరు రావాలి.''

''తప్పకుండా సార్. ఈరోజు వెళ్ళిపోవచ్చునా?''జారుతున్న పైటను సర్దుకుంటూ అడిగింది శ్రీదేవి.

''అమ్మగారికి ఒంట్లో బాగోలేదంటున్నారు. ఇప్పుడే వెళ్ళిపొండి''

''స్టేట్‌మెంట్‌లో తప్పులున్నాయో ఏమో సార్''

''సుందర్రావుని చూడమంటానులెండి''

★ ★ ★

మర్నాడు హోటల్లో శ్రీదేవి '' పార్టీ అంటే చాలామంది వస్తార నుకున్నాను సార్. నన్ను మాత్రం పిలిచారనుకోలేదు'' అంది.

''మీరంటే ప్రత్యేకమైన అభిమానం'' అన్నాడాయన. పాతికేళ్ళ పరువంలో ఉన్న అమ్మాయితో హోటల్‌కి వచ్చినందుకు మురిసిపోతున్నాడు. ఎవరైనా తెల్సిన వాళ్ళు చూస్తే బాగుండును. తనింకా అమ్మాయిలని ఆకర్షించ గలనని గర్వంగా చూపించుకోవచ్చునని ఆశపడుతున్నాడు.

''సార్'' అంది శ్రీదేవి.

ఏమిటన్నట్లు చూశా డతను.

''ఈ ఏడు బెస్ట్ ఎంప్లాయీ'' అవార్డుకి సెంట్రల్ ఆఫీస్‌కి పేర్లు పంపిస్తున్నారుటకదా...సుందర్రావు పేరు ప్రపోజ్ అవుతుందనుకుంటున్నారందరూ''

''ఎవరన్నారు?''

శ్రీదేవి పెదవిని మునిపంటితో కొరుక్కుంది. పైట కొంగు సర్దుకుంది. ''స్వీట్ బాగుంది సార్'' అంటూ స్పూన్‌తో ఆయన నోట్లో పెట్టింది.

''సార్, మా అమ్మగారికి ఒంట్లో బాగోకపోయినా ఆఫీసుకి వస్తున్నానుకదా''

ఆఫీసుకు రావడం వేరు, పని చెయ్యడం వేరు అని తెలియని మైమరపులో ఉన్న ఆఫీసరు ''సుందర్రావు పేరు ఎవరు మీకు చెప్పారు? మీ పేరే ప్రపోజ్ చేస్తున్నాను.'' అన్నాడు. ఆయన చెయ్యి పట్టుకు కుదిపేస్తూ శ్రీదేవి ''థాంక్యూసార్'' అంది.

లోకం దృష్టిలో శ్రీదేవి ఇంటా, బయటా కష్టపడుతున్న ఉత్తమ ఉద్యోగిని.

★ ★ ★

''శాంతీ, మేడమ్ రమ్మంటున్నది''కరుగ్గా ఉంది వీరేశం గొంతు.

శాంతి నిస్సహాయంగా చూసింది. రావడం తప్పదన్నట్లుగా నిల్చున్నాడు వీరేశం. శాంతి నీరసంగా లేచి మేడమ్ దగ్గరకు వెళ్ళింది.

''ఇంకా డ్రెస్ చేసుకోలేదేం'' మేడమ్ పాన్ నములుతూ అడిగింది. కిళ్ళీ తాలూకు తుంపరలు శాంతి మీద పడ్డాయి.

''ఈ వేళ ఇంకా నాలుగో రోజు'' శాంతి బిడియంగా చెప్పింది.

దేనికి నాలుగోరోజో తెల్సుకోలేని అమాయకురాలు కాదు మేడమ్. ఆమె కూడా ఆడదే కదా.

''ఇంకా నాలుగోరోజు, మూడో రోజు అంటూ నువ్వు లెక్కలు చెప్తూ కూచుంటే వినడానికా నిన్ను నలభైవేలు పెట్టి కొన్నది? నీ తిండికీ, బట్టకీ ఎంత ఖర్చవుతోందో నీకు తెలుసా? నువ్విలా పని ఎగ్గొడుతూ కూచుంటే ఎప్పటికి నా డబ్బు నాకొస్తాయి? వెళ్ళు. మాట్లాడకుండా డ్రెస్ చేసుకో ఇంకో అరగంటలో హుషారుగా ఉండాలి తెలుసా? ఏడుపుమొహం పెట్టుకుంటే ఏ వెధవా నిన్ను దగ్గరకు తియ్యడు.''

శాంతి నెమ్మదిగా తల ఊపి లోపలకు వెళ్ళి డ్రెస్ చేసుకోసాగింది. నాలుగో రోజుకి అవసరమైన జాగ్రత్తలు తీసుకుని, నీలిరంగు మాక్సీ వేసుకుంది. ముఖానికి మందంగా పౌడరు కొట్టుకుని, సెంటు రాసుకుంది.

తమ అందం మగవారినందరినీ ఆకర్షించాలని ఆడవాళ్ళందరూ కోరుకుంటారు. అందుకు భిన్నంగా శాంతి తను ఏ మగవాడికీ ఈ రాత్రి నచ్చకపోతే బాగుండునని కోరుకుంటోంది.

ఆమె కోరిక తీరలేదు. సారా వాసన కడుపులో తిప్పుతుండగా, పైకి చిరునవ్వు నవ్వుతూ, తను కావాలని మేడమ్‌కి డబ్బిచ్చిన మగవాణ్ణి సంతోషపెడుతోంది శాంతి.

ఆ సమయంలో వచ్చాడు కానిస్టేబుల్. నెలాఖరులోగా నాలుగు కేసులైనా బుక్ చెయ్యకపోతే ట్రాన్స్‌ఫర్ చేస్తానన్న సబ్‌ఇన్‌స్పెక్టర్ వార్నింగు అతని చెవిలో గింగురుమంటోంది.

కానిస్టేబుల్ రాగానే కలకలం మొదలైంది. మేడమ్ అతని చేతిలో ''మామూలు''పెట్టింది. నాలుగు కేసులు కావాలన్నాడతను. ఆవిడ సరేనంది.

మేడమ్‌కానీ, వీరేశాన్ని కానీ, విటులని కానీ కానిస్టేబుల్ కన్నెత్తైనా చూడలేదు. అతని దృష్టి శాంతి మీద పడింది. ఈ అమ్మాయిని తీసికెళ్ళి సబ్ ఇన్‌స్పెక్టర్‌కి సమర్పిస్తే తనకి హెడ్ కానిస్టేబుల్ ప్రమోషన్ ఖాయం అనుకున్నాడతను.

శాంతినీ, ఇంకో ముగ్గురు అమ్మాయిలనీ స్టేషనుకి తీసుకుపోయాడు.

సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోషించాడు. కానిస్టేబుల్ ''అమ్మయ్య''అనుకున్నాడు.

మర్నాడు సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ ఆక్ట్ కింద శాంతిని కోర్టులో ప్రవేశపెట్టారు.

చట్టం దృష్టిలో శాంతి శిక్షార్హురాలు
సంఘం దృష్టిలో శాంతి ''పతిత''. ★